క్లుప్తంగా

యాజమాన్య పద్ధతులు పాటించాలి



ఇటిక్యాలలో పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

జగదేవ్‌పూర్(గజ్వేల్): పత్తి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ములుగు వ్యవసాయ డివిజన్ అధికారి అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం సాక్షిలో 'దిగుబడిపై దిగులు' అనే కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన వ్యవసాయ అధికారులు శుక్రవారం మండలంలోకి ఇటిక్యాలలో పత్తి పంటలను పరిశీలించారు. అధిక వర్షాలకు పత్తి పంటలో పారా విల్ట్ లేదా సడెన్ విల్ట్ అధికంగా ఉండటం గమనించారు. ఈ లక్షణాల వల్ల పంట ఎండిపోవడం, రంగు మారుతుందన్నారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే రైతులు ఒక లీటర్ నీటికి 5 గ్రాముల 19–19–19 కానీ 13–0–45, 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ కలిపి ద్రావణాన్ని తయారు చేసి మొక్కల వేర్లకు పోయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వసంతరావు, ఏఈఓలు ఖలీల్, భాను, శరణ్య, సమత, రైతులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమాన

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమాన విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి పది రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 11 మంది మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడ్డారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.14,500 జరిమాన విధించినట్లు సీఐ తెలిపారు.

పౌష్టికాహార లోపంతో అనేక సమస్యలు: సీడీపీఓ రమా

కొండపాక(గజ్వేల్): పోషకాహారం లోపంతో అనేక రకాల సమస్యలు వస్తాయని సీడీపీఓ రమా పేర్కొన్నారు. శుక్రవారం కొండపాక మండలం దుద్దెడలో గల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ఆవశ్యకతపై ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తోందన్నారు. అనంతరం పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇందిరా, ఏఎన్ఎంలు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికే సహకార సంఘాలు



శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ తదితరులు

బెజ్జంకి(సిద్దిపేట): రైతుల సంక్షేమం కోసమే సహకార సంఘాలు, సహకార బ్యాంకులు అని, ఇవి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. బెజ్జంకి సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని గూడెం(బేగంపేట) శివారులో ఏర్పాటు చేసిన ఐఓసీఎల్ పెట్రోల్ పంపును, శిలాఫలకంను శుక్రవారం కేడీసీసీ చైర్మన్ కొండూరి రవీందర్ రావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలకు సేవలందేలా పథకాలను విస్తరించినట్లు తెలిపారు. బెజ్జంకి సహకార సంఘం చైర్మన్ తన్నీరు శరత్‌రావు, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ అలువాల్ కోటి, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, సీఈఓ వాసు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, వైస్ చైర్మన్‌లు శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, నాయకులు జువ్వాడి మన్‌మోహన్‌రావు, రత్నాకర్‌రెడ్డి, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన

సిద్దిపేటఅర్బన్: వర్షాలతో నీట మునిగిన పంట పొలాలను సిద్దిపేట అర్బన్ మండలం వ్యవసాయాధికారి శ్రీనాథ్ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని వెల్కటూరు, బక్రిచెప్యాల, నాంచార్‌పల్లి, ఎల్లుపల్లి, ఇమాంబాద్ గ్రామాల్లో అధిక వర్షాలతో నీట మునిగిపోయిన, ఇసుక మేట వేసిన పొలాలను ఏఈఓలతో కలిసి ఆయన పరిశీలించి నష్టం లెక్కించారు. ఈ వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు ఉన్నారు.



వర్గల్: సమాఖ్య ప్రతినిధుల ఆధ్వర్యంలో..



కొండపాక(గజ్వేల్)లో..



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)లో..

మట్టి గణపతినే పూజిద్దాం

పర్యావరణ హితమైన మట్టి గణపతులనే పూజిద్దామని వక్తలు అన్నారు. శుక్రవారం జిల్లాలోని పలు మండలకేంద్రాల్లో ఉన్న స్కూల్ విద్యార్థులకు, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు మట్టి వినాయకుల ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మట్టి 'గణపతుల ప్రతిమలనే పూజిద్దామని ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో తయారైన విగ్రహాల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, విద్యార్థులు , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్ రూరల్‌లో..

కుడిచెరువు ఆక్రమణలు తొలగేనా?

- వర్షం కురిస్తే పరిసరప్రాంతాలన్ని ముంచెత్తుతున్న వరద
- జలమయంగా మారుతున్న కాలనీలు



ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మాణాలు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల కుడి చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో కొంత భాగం ఆక్రమణకు గురైందని కొన్నేళ్లుగా ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై గతంలో సంబంధిత అధికారులు అనేక సర్వేలు నిర్వహించి కొన్ని ఒత్తిళ్ల కారణంతో హద్దులు ఏర్పాటు చేయకుండా వదిలేశారు. దీంతో భారీ వర్షాలు కురిసిన ప్రతీసారి చెరువు పరిసర ప్రాంతం ముంపునకు గురవుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు పరిసర ప్రాంతం అంతా జలమయం కావడమే నిదర్శనం. వరద నీటిని చెరువులోకి చేర్చే కాల్వలను సైతం కొందరు రియల్ వ్యాపారులు, బడాబాబులు తమ వ్యాపారాల కోసం కూల్చివేశారు. దీంతో చెరువులోకి వెళ్లాల్సిన వరద ఇళ్ల మధ్యలోకి చేరి కాలనీలు జలమయమయ్యాయి. ఇది ఇలా ఉంటే ఎఫ్టీఎల్ పరిధిపై అధికారుల్లో స్పష్టత లేకపోవడం, సరైన హద్దులు నిర్ణయించకపోవడం ఆక్రమణలకు గురవుతోంది.

చేర్యాల కుడి చెరువు సుమారు 60 ఎకరాల పైచిలుకు విస్తీర్ణంలో ఉంటుంది. ఇందులో కొంత పట్టా భూమి కావడంతో ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్టీఎల్), బఫర్ జోన్‌ల పరిధిలలో కొంతమంది రియల్ వ్యాపారులు, స్థానిక నాయకులు, అధికారుల అండతో వెంచర్‌గా మార్చి సొమ్ము చేసుకున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. ఎఫ్టీఎల్ పరిధిలో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తుల ప్లాట్లు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిని ఆనుకుని ఉండటంతో అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపట్టారు. వీటితో చెరువు పరిమాణం తగ్గి నీరు రోడ్డుపైకి చేరి వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా పేరుతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని చెరువుల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించడాన్ని చేర్యాల ప్రజలు స్వాగతించారు. హైడ్రా పరిధిని విస్తరించి చేర్యాల కుడి చెరువులో చేపట్టిన అక్రమ కట్టడాలను కూల్చివేయాలని కోరుతున్నారు.

ఆక్రమణదారుల్లో గుబులు....

హైడ్రా తరహాలో ఒక వ్యవస్థ జిల్లాలకు విస్తరిస్తామని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని, కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు ఆక్రమణదారుల్లో గుబులు పుట్టిస్తోంది.

నాలాలు కనుమరుగు

వర్షపు నీరు చెరువుల్లోకి చేరే నాలాలు పట్టణ కేంద్రంలో కనుమరుగయ్యాయి. స్థానిక గాంధీ సెంటర్, యూనియన్ బ్యాంకు, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లో చెరువులోకి నీరు వచ్చేందుకు నాలాలు ఉండేవని కాలనీవాసులు చెబుతున్నారు. కానీ అవేవి ఇప్పుడు కనిపించడం లేదు. వాటిని సైతం, ఆక్రమించి పూడ్చివేసి శాశ్వత నిర్మాణాలు చేపట్టడంతో కనుమరుగయ్యాయని అంటున్నారు.

చర్యలు తీసుకోవాలి



చెరువు విస్తీర్ణం, ఎఫ్టీఎల్, బఫర్‌జోన్‌లను నిర్ధారించి చెరువు భూములను కబ్జా చేసిన వారిని గుర్తించి హైదరాబాద్ రతహాలో చర్యలు తీసుకోవాలి. అవసరమైతే హైడ్రా చేస్తున్నట్లు అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి.

– అవుశర్ల వెంకటేశ్, కుడి చెరువు పరిరక్షణ సమితి కార్యదర్శి

ఉపాధ్యాయులు సమసమాజ నిర్మాతలు

- డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉపాధ్యాయులు సమసమాజ నిర్మాతలని, విద్యార్థులు ఉన్నతంగా ఎదగడానికి దిశానిర్దేశం చేసేది గురువే అని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలం నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 16 మందిని శుక్రవారం చిన్నకోడూరు ఎంపీడీఓ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి కారణమైన గురువులను జీవిత కాలం గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

బెజ్జంకి(సిద్దిపేట): సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.7.48 లక్షల చెక్కులను శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే సత్యనారాయణ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

◆ ఎంపీకి వినతి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని దానంపల్లి నుంచి నర్మెట్ట వరకు ఉన్న 3 కి.మీ బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, దానంపల్లి గ్రామస్తులు కోరారు. శుక్రవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు.

◆ విలువలతో కూడిన వృత్తి జర్నలిజం

సిద్దిపేటఅర్బన్: జర్నలిస్టుల వృత్తి విలువలతో కూడినదని, మెరుగైన సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో ఉంటుందని బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైరి శంకర్, విద్యారణ్య ఆవాస విద్యాలయం జోనల్ ఇన్‌చార్జి కాటం రవీందర్ అన్నారు. జాతీయ జర్నలిస్టు డే ను పురస్కరించుకొని శుక్రవారం సిద్దిపేట అర్బన్ ప్రెస్ క్లబ్ వద్ద అర్బన్ జర్నలిస్టులను సన్మానించారు. అనంతరం తడకపల్లిలోని విద్యారణ్య ఆవాస విద్యాలయ నిర్వాహకులు సైతం సన్మానించారు.

కొండపాక(గజ్వేల్): సమాజానికి జర్నలిస్టులు దిక్సూచీలాంటి వారని క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ ఇల్లా అధ్యక్షులు లింగ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని సిర్సనగండ్ల హైస్కూల్లో జర్నలిస్టు డేను పురస్కరించుకొని మండలంలో ఉన్న జర్నలిస్టులను హెచ్‌ఎం పెద్ది విఠల్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు.

గజ్వేల్‌రూరల్: సమాజ మార్గనిర్దేశకులు జర్నలిస్టులని రాజకీయ విశ్లేషకులు బండారు రామ్మోహన్ రావు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ సెంట్రల్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో పలువురు జర్నలిస్టులను సన్మానించారు.

◆ సంస్మరణ సభకు తరలిరండి

దుబ్బాకటౌన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. దుబ్బాక పట్టణంలో శుక్రవారం పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. దుబ్బాకలో ఈనెల 12న సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

◆ ఎమ్మెల్యే పరామర్శ

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ బీఆర్‌ఎస్ నాయకుడు సంజీవరెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల సంజీవరెడ్డి తండ్రి మృతిచెందడం తెలిసిందే. ఆయన వెంట తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, పీఎస్‌సీఎస్‌సీ చైర్మన్ షేర్ల కైలాశ్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

◆ మహేశ్‌కుమార్ నియామకంపై హర్షం

సిద్దిపేటకమాన్: పీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ నియామకంపై కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సతీశ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు బస్టాండ్ చౌరస్తా వద్ద టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు జీవన్‌రెడ్డి, భిక్షపతి, అంజయ్య, ప్రవంతి, సంతోష, రజని పాల్గొన్నారు.

◆ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి బేస్‌బాల్ జూనియర్ విభాగ పోటీలకు పట్టణంలోని జీడీఆర్ పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులు ఎంపికైనట్లు శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ సోమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 14 నుంచి 16 వరకు నిర్మల్‌లో జరిగే పోటీలలో జిల్లా జట్టు తరఫున పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. పీఈటీలు రాజశేఖర్‌రెడ్డి, హారిక, బషీర్, యాకూబ్ పాల్గొన్నారు.

◆ రోడ్డు సేఫ్టీ నిబంధనలు పాటించాలి

సిద్దిపేటకమాన్: వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన 13 మంది వాహనదారులకు ట్రాఫిక్ పీఎస్‌లో శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు పాటించి వాహనాలను నడిపితే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు అన్నారు. పట్టుబడిన వారు పెండింగ్‌లో ఉన్న చలాన్‌లు రూ.11,250లు చెల్లించినట్లు తెలిపారు.

ప్రధాన రోడ్డుకు గుంతలు



రోడ్డుపై ఉన్న వరద నీటిలో ప్రయాణిస్తున్న వాహనదారులు



గుంతల వైపు వెళ్లకుండా అడ్డుపెట్టిన టేబుల్

వర్గల్(గజ్వేల్): వర్గల్ ప్రధాన రోడ్డుకు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. పైగా వర్షం పడితే అంబేద్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం దాకా వరద నీరు చేరి చెరువును తలపిస్తోంది. దీంతో వాహన చోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో వర్గల్ గ్రామ ప్రధాన రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఈ గుంతల మూలంగా వాహనదారుల వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. అనేక సందర్భాల్లో స్థానికులే క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్నారు. వీరే గుంతుల్లో కొంత డస్ట్ పోశారు. ఇంకా గుంతలున్న చోట అటు వైపు చోదకులు వెళ్లకుండా పాత 'టేబుల్'ను అడ్డుగా పెట్టారు.

మరమ్మతులు చేపడతాం: వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ డీఈ

వర్గల్ ప్రధానరోడ్డు గుంతలతో దెబ్బతిన్నట్లు నా దృష్టికి రాలేదు. పుణ్యక్షేత్రానికి వెళ్లే యాత్రికులు, ప్రయాణికులు ఇబ్బందికి గురికాకుండా వెంటనే మరమ్మతులు చేపడతాం.

సెల్‌ఫోన్ అప్పగింత

సిద్దిపేటకమాన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి అందజేశారు పోలీసులు. పట్టణానికి చెందిన నరేశ్ మూడు నెలల క్రితం పట్టణంలో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఆ వెంటనే వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీఈఐఆర్ యాప్ నూతన టెక్నాలజీ సాయంతో దాన్ని గుర్తించారని సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు తెలిపారు. ఎస్ఐ కనకయ్యగౌడ్ శుక్రవారం బాధితుడికి అందజేసినట్లు తెలిపారు.

9న ఖోఖో సెలక్షన్స్

సిద్దిపేటజోన్: ఈనెల 9న మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా సబ్ జూనియర్ ఖోఖో జట్టు సెలెక్షన్స్ ఉంటాయని సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట్‌స్వామి పేర్కొన్నారు. ఈనెల 13 నుంచి 15 వరకు ఖమ్మం జిల్లా కల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు సభ్యులను తూప్రాన్‌లో ఎంపిక చేస్తారని తెలిపారు. వివరాలకు 98665 46563, 89856 55935 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: ప్రతీ వినాయక మండప నిర్వాహకులు తప్పకుండా ఆన్‌లైన్‌లో పర్మిషన్ తీసుకోవాలని చైర్‌పర్సన్ ఆకుల రజిత సూచించారు. పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం గణేశ్ మండపాల నిర్వాహకులతో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. నిర్వాహకులు రోడ్లను పూర్తిగా బ్లాక్ చేయకుండా మండపం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కరెంట్ సౌకర్యం కోసం ఆశాఖ అధికారులను సంప్రదించాలన్నారు. మండపాల వద్ద ఎట్టి పరిస్థితుల్లోను డీజేలను వాడకూడదన్నారు. ప్లాస్టిక్ ప్లేట్స్‌కు బదులు పట్టణంలోని స్టీల్ బ్యాంక్‌ను ఉపయోగించుకోవాలన్నారు. అన్నదానం చేసేటప్పుడు చెత్త డబ్బాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున గౌడ్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేటట్టు చూసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో డ్రై డే ఫ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేయడం, స్ప్రే చేయించడం, బ్లీచింగ్ చల్లించడం వంటి కార్యక్రమాలను చేపట్టారు. రెండు మూడు రోజులుగా కురిసిన వర్షాల వలన సీజనల్ వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునగౌడ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, వార్డు ఆఫీసర్ పద్మ, సాంబరాజు పాల్గొన్నారు.

చెరువులు, కుంటల పరిశీలన



పందిల్ల కుమ్మరి కుంటను పరిశీలిస్తున్న లస్కర్లు

హుస్నాబాద్‌రూరల్: పల్లెలో చెరువు, కుంటల సంరక్షణ కోసం ప్రభుత్వం వీఆర్‌ఏలను లస్కర్లుగా నియమించగా విధుల్లో చేరారు. శుక్రవారం పందిల్లలో చెరువు, కుంటల నీటి మట్టం , చెరువు కట్టల సంరక్షణను పరిశీలించారు. డివిజన్ పరిధిలోని 9 గ్రామాల్లో ఉన్న 130 చెరువు, కుంటల సంరక్షణ బాధ్యతలను నలుగురు లస్కర్లకు అప్పగించారు. నిత్యం చెరువు కట్టలపై ఉన్నతాధికారులకు తెలపాల్సి ఉంటుంది. శిఖం భూములు ఆక్రమణల బారిన పడకుండా పర్యవేక్షణ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు లస్కర్లు తెలిపారు.

అవార్డు రావడంపై హర్షం



మాజీ మంత్రి హరీశ్‌రావు నుంచి అవార్డు అందుకుంటున్న భానోతు మోహన్

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం అంతక్కపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు భానోతు మోహన్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్నాడు. ఈ అవార్డు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా తీసుకున్నారు. అవార్డు రావడం పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.